శునక ప్రదర్శనం

'క్షేమేంద్ర'



"రేపు బొటానికల్ గార్డెన్స్‌లో డాగ్ షో ఉంది. మన థండర్‌ని తీసుకెళ్ళాలి సుమీ నువ్వు" అని ముదలకించాడు నరసింహం గారు.

మామయ్యకు శునక లోకంమీద ఉన్న ప్రేమ సుందరానికి తెలియని విషయం కాదు. నాలుగ్కాళ్ళుకల అజాతిజంతువుల గురించిన ఆయన విజ్ఞానం అపారమని సుందరం అనుమానం. ఏదో అత్యవసరమైన పని ఉంటేగాని మామయ్య ఇంత అపూర్వావకాశం జారవిడుచుకోడు కాబట్టి రేపు తను థండర్ బోల్టుని - అది వాళ్ళ కుక్క పూర్తిపేరు - వెంటబెట్టుకు పోయి తత్ప్రదర్శనంలో పాల్గొని ఏమన్నా బహుమతి సంపాయిస్తే దాన్ని చేతుచ్చుకుని ఇంటికి రావాలన్నమాట. బాగానే వుంది. రోజూ తను షికారుపోవడంలా దాన్ని తీసుకుని? అల్లాగే రేపు బొటానికల్ గార్డెన్స్‌కి పోతే సరి. కొంచెం ఎక్కువ దూరం పోవాలి, అంతే.

"ఏమిటి, ఆలోచిస్తున్నావ్" అన్నాడు మామయ్య.

"ఏంలేదు."

"జరూరుగా కోయంబత్తూరు పోవాల్సినపని తగిలింది. లేకపోతే..."

సుందరానికి తెలుసు మామయ్య ఏమనబోతున్నాడో - లేకపోతే తను జన్మలో మిస్ కాడు అలాంటి అద్భుత శునక సమ్మేళనం.

"రేపు నువ్వు అమితంగా ఆనందిస్తావని నావిశ్వాసం", అని అంగ్లంలో తన అసూయను ప్రకటించాడు మామయ్య.

ఆయనన్నది నిజమేకావచ్చు. శుభ్రమైన కుక్కలంటే అసహ్యంలేదు సుందరానికి. అందులో ఆల్సేషియన్ లంటే అమితాభిమానం. థండర్ ఆల్సేషియన్ జాతికి చెందిందే. దాని కడుపుడక! ఎంత బలమనీ దానికి? సులభంగా బండిగుఱ్ఱాని కున్నంతబలం వుంది. తను రోజూ దాన్ని షికారుకి తీసుకుపోతాడని పేరేగాని నిజంగా తననే అది తీసికెళుతుంది. మెడ పట్టే కున్న గొలుసు ఉగ్గదీసి పట్టుకుని దాని ఉషారు అదుపులో పెట్టడం అవస్థల్లో అవస్థ. అందుకనే అనుకుంటా ఉపేంద్ర బాబు వాళ్ళకుక్కని (అదీ ఆల్సేషియనే) తను సైకిలు తొక్కుతూ షికారు తిసుకెళ్తాడు గిండీ రోడ్డుమీద. కాని మామయ్యకు భయం, తప్పదారి చక్రంగాని కాలిమీన్నుంచి పోయేనా నిక్షేపంలాంటి కుక్క ఎందుకూ పనికిరాదని. అవును. కుంటికుక్క నెవరు పెంచుకొంటారు ఇంట్లో? కుక్క సాంఘికఅంతస్తు చూపించే చిహ్నల్లో ఒకటి. ఎన్ని కుక్కలున్నయ్, ఏయే జాతులవీ, వాటి పోషణెలావుంది, అవి ఇంట్లో గాని బయటగాని ఎంత మర్యాదగా మెసులుకుంటయ్! ఇవన్నీ నీ గౌరవనీయతని నిర్దుష్టంగా రెండో దశాంశస్థానందాకా తేల్చి చెప్పడానికి పెద్ద ఉపయోగించే పద్ధతుల్లో ఉన్నవే.

తను చెన్నపట్టణం వచ్చిన కొత్తలో ఆశ్చర్యపడ్డాడు, "కుక్కవుంది కావున కబడ్దారుగా సంచరించవలసింది" అని ఇంగ్లీషులో రాసి గేటుకు తగిలించున్న బోర్డులు చూసి కొందరియిళ్ళకి. కావలసిన వాళ్ళొచ్చినా కండలుపట్టి పీకేస్తుందికద అలాంటికుక్క! యజమాని కర్మ కాక పోతే మరేమిటది? ఓసారి అనుభవమయింతర్వాత మళ్లీ మరుసటిరోజు గుమ్మం తొక్కడెవడు కాని. తప్పని సరిగా రావాల్సి వచ్చినా ప్రాణాలర చేతులో పెట్టుకుని బిక్కు బిక్కుమంటూ అడుగుపెట్టాలిసిందే, ఏమూలనించి నిశ్శబ్దంగా వొచ్చి పిక్క లంకించుకుంటుందో రాకాసి కుక్క అని. సామెతప్రకారం చూస్తే, కరిచే దుర్గుణం ఉన్న కుక్కలన్నిటికీ నలుగురూ చూసి ఆనందించాలన్న వ్యామోహం లేదు; వాటి పని అవి చీమ చిటుక్కుమనకుండా చేసుకుపోతయ్. వచ్చే పబ్లిసిటీ ఎలాగూ పట్టుబడిన పెద్దమనిషి ఆక్రోశాల్లో వస్తుందని వాటికి తెలుసేమో? తప్పకుండా తెలిసేవుంటుంది. ఎందుకంటే కుక్క తెలివైన జంతువ దానిమీద ఎన్ని కథలు, ఏం వ్యవహారం! దాని తెలివితేటలు, ధైర్య సాహసాలు, విశ్వాసం ఒకటేమిటి అన్నీ కథల్లోకి ఎక్కినయ్. కొన్ని కుక్కలు సారస్వతంలో అజరామరంగా నిల్చిపోయినయ్. ఇంతెందుకు? ఒక్క మాటలో కుక్కవ్యక్తిత్వాన్ని గురించి తెలిసినంతగా ఎవరికైనా ఏజంతువును గూర్చి తెలియదు. అయితే మామయ్యకు అందరికన్నా ఎక్కువ తెలుసు ఆ రకపు దైవసృష్టినిగూర్చి.

"రేపు డాగ్ షోకి పోవాలి తప్పక" అని నిశ్చయం చేసుకున్నాడు సుందరం.

అతను ఇంటర్ మీడియెట్ నించీ మెడ్రాసులోనే చదివాడు మామయ్య ఇంట్లోవుండి. నరసింహంగారు ప్లీడరు; పెద్ద ప్లీడరనే చెప్పాలి, నెలకో వెయ్యిరూపాయలు తక్కువ కళ్ళ చూడడు. ఆయనకి మగసంతులేదు, ఇద్దరాడపిల్లలు మాత్రం. వాళ్ళూ సుందరం కన్న పెద్దవాళ్ళే. పెళ్ళిళ్ళయి కాపరాలు చేస్తున్నారు. "మీసుందరాన్ని కాలేజీ చదువుకి మెడ్రాసెందుకు పంపకూడదూ? మాయింట్లో ఉండి చదువుకుంటాడు" అని నరసింహం గారన్నప్పుడు సుందరం ఎగిరి గంతేశాడు; వాళ్ళనాన్న అడ్డుచెప్పలేదు.

★ శునక ప్రదర్శనం ★

తల్లి మనసులోనే అన్నగారిని కృతజ్ఞతతో అభినందించింది. వాళ్ళదీ పెద్ద సంసారం; ముసలీ ముతకా పిల్లా పీచూ అంతా కలిసి మొత్తం ఓ పదిమంది తేలతారు. సుందరం నాన్న తహసీల్దారు. పరద్రవ్యాణి లోష్ఠవత్; దమ్మిడీ పుచ్చుకోడు. "మాయరు వృత్తిలో నిజాయితీ లేదు. డబ్బెక్కువొచ్చే సూచనలుంటే సరి, ఎటుపడితే అటు మాట్లాడతారు" అని విమర్శిస్తాడు తన కన్న పెద్దవాడైన బావగార్ని. ఆయన మటుకు తీసిపోయాడా? "నా కక్షిదారు చెప్పింది నిజమనే విశ్వాసంతోనే వాదిస్తాను కాని అబద్ధమని నమ్మకం కలిగినప్పుడసలు వాదించనేలేను. ఇహ డబ్బెర చూపితే పక్షాలు మారుస్తారని అన్నావే అది అసత్యం. మాకూ వృత్తి న్యాయాల్లో విధి నిషేధాలున్నయ్"అంటాడు. సుందరం నాన్న ఒప్పుకున్నాడు, కొడుకుని మద్రాసులో చదువుకి పెట్టడానికి. అయితే జీతాలు మాత్రం తనే కడతాడు. అప్పటికాని ఆయనకు తృప్తి కలగలా.

సుందరం తెలివైనవాడు, మద్రాస్ కళాశాలల్లో బాగా చదువు చెపుతారు. చెడిపోయేవాళ్ళు చెడిపోతూనే వుంటారు ఎక్కడున్నా. అత నటువంటి సజ్జువాడు కాడు; ప్రతిఏడూ విడవకుండా మంచి మార్కుల్తో పాసవుతూ, ఆ ఏడే ఎం. ఏ. పరీక్ష కెళ్ళాడు. క్లాసు తప్పదు. తను బాగానే రాశాడు. దీంతరవా తేమిటి? మామయ్య లాచదవమంటాడు, అనటానికేం? అందరూ తనమల్లే సంపాయించారా? పైగా నాన్న కిష్టంలా వెధవ ప్లీడరీ. సుందరం మనస్సు ఆలిండియా సర్వీసెస్ పరీక్షమీదుంది. తను ఎం. ఏకి చదువుతూనే అదికూడా దృష్టిపథంలో పెట్టుకు చదివాడు. ఏమో? అదృష్టం బాగుంటె క్లాస్‌వన్ ఆఫీసర్. "ఈవేసంగికి ఇంటికి పోవాలా"అని ఆలోచించాడు సుందరం. ఇంటిదగ్గర అంతగా చదువు సాగదు. కాని నిర్ణయం చేసింది మామయ్య; "ప్రతేడూ వేసంగికింటికి వెళుతున్నావుగా? ఈసారికి మాతోపం డివా, ఊటీపోదాం. నువ్వు లేకపోతే ఏం సందడి తక్కువకాదులే మా యింట్లో. ఏమంటావ్?" అన్నాడు. సుందరం ఏమంటాడు, సంతోషంగా ఒప్పుకొన్నాడు. తత్ఫలితంగా ఓగోజా చల్లని గాలి స్వాగతం పలుకుతూండగా ఉరకలు వేసే హృదయంతో ఉదకమండలంలో దిగాడు సుందరరామ శర్మ తన మేన మామతో ఆయన పెళ్లాంతో.

ప్రతివాడి జీవితంలోనూ కొన్ని సమస్యలు తలమాపుతయ్. కొన్ని కొన్ని సంఘటనలు జరుగుతయ్ వాడి వాడి నిర్ణయానుసారంగా. అప్పటిలో అంతగా తెలియకపోయినా భావిజీవన పంథా కొత్తగా అక్కణ్ణించే మొదలెట్టినట్టు తరవాత స్పష్టమౌతుంది, ఆ దోవ చీలినచోటికి వచ్చేవరకూ అంటే ఇంకో సమస్య తలయెత్తే వరకూ. ఆ లు దోవల్లో తను వచ్చిన దోవ కాక మిగిలిన రెండో దోవ తొక్కితే ఏమైఉండునూ అనేది ఊహాకందని విషయం. నీ జీవితం మళ్ళీ జీవించాలి. కాలానికెప్పుడూ పురోగమనమే కాబట్టి అది కుదరనే కుదరదు. చెయ్యగలిగిందల్లా చేసిన తప్పు ముందుముందు నిర్ణయాల్లో సరిదిద్దుకోడం. అదీ ఒకొక్కప్పుడు మాత్రమే సాధ్యం.

సుందరానికి తను ఊటీ వెళ్ళడం, డాగ్ షోకి పోవలసిరావడం తన జీవితంలో అంత ప్రముఖమైన విషయాలుగా అప్పుడు కనపట్టలా. కాని ఆ మరుసటోజే తెలిసొచ్చింది కొంచెంగా.

*   *   *

తెల్లవారింది. చాలామందికి సాధారణంగా, సుందరానికి అందంగా, మామయ్యకు విసుగ్గా. శునక ప్రదర్శనాన్ని మిస్ అవుతూన్నందుకు ఇంకోసారి విచారించాడు మామయ్య; సుందరం అదృష్టాన్ని అభినందించాడు; థండర్ బోల్టుకి విజయాన్ని ఆశించాడు.

రైలు కదిలేముందు హఠాత్తుగా స్ఫురించి "కుక్కని నడిపించేవు సుమీ అంతదూరం వద్దు. టాక్సీలో పోండి. ఫ్రెష్ గా ఉండాలి అక్కడికి కెళ్ళేటప్పటికి" అని ఆజ్ఞేపించాడు.

అవిఘ్నమస్తుగా అవతరించేడు సుందరం ఉలెన్ పాంటులో, సిల్కు షర్టులో, శునక ద్వితీయుడై. ఏం జనం, ఏం జనం! వినోదార్థం విచ్చేసినవాళ్ళూ, పోటీకోసమని పొరుగూళ్ళనించి కూడా కుక్కారలోకంతో దిగిన పెద్దలూ. కొన్ని కుక్కలూ, ఎక్కువ మనుషులూ. ఆడా, మగా. మంచు తెలుపుదగ్గర మొదలెట్టి మసి నలుపుదాకా దేహకాంతులు. ఇంద్రధనుస్సులో ఉన్నవీ లేనివీ అన్ని రంగులూ అక్కడే ప్రత్యక్షం. బొటానికల్ గార్డెన్స్ పెళ్ళిమని పలిగిపోయింది.

థండర్ స్వజాతీయుల శక్తిసంపదల్నీ సౌందర్యాన్నీ చూపుమాత్రంలో తేల్చేసుకొని తృప్తిగా గెలుపు మనదే అని బరవాసాతో గర్వంగా అడుగు వేస్తూంటే తనని చుట్టుముట్టిన అందంలో, ఉత్సాహంలో, ఆనందంలో తన్ని తాను మరిచిపోయి తిరిగాడు సుందరం.

తిరిగితిరిగి తెలివిని పడ్డాడు. తెలివిని పడి తెల్లబోయాడు. ఎంత అందం! మనిషి పొడుగ్గా పచ్చగా, ముఖం కోలగా తెలివిగా, కళ్ళు చురుగ్గా వెలుగ్గా, ఎంత బాగుంది! ఎవరీ అమ్మాయి? గుండె ఓసారి కొట్టుకోవడం మరిచిపోయి, కొద్దిసేపు వేగంగా కొట్టుకుని, మరుక్షణం మాయమైంది ఉన్నచోట్నించి. రోమియో అండ్ జూలియెట్ ప్రథమాంకం పాకానికి దిగింది, కనీసం ఒకవేపునించయినా.

సరిగా కొలిస్తే భూమికి జానెడెత్తులేని కుదిమట్టపు కుక్కొకటీ, ఓ చెయ్యి పుచ్చుకొని దిక్కులుచూస్తూ కబుర్లు చెపుతూన్న ఓ ఏడేళ్ళ కుఱ్ఱకుంక, ఇదీ పరివారం. పోలికనిబట్టి వాడు తమ్ముడు; తరహా చూస్తే కనపడ్డ పాముని కలుగున పోనిచ్చే రకం కాదు. ఆమె వాడితో ఏదో చెపుతూ నవ్వుతోంది. అందమైనవాళ్లు నవ్వుతూంటే ఎంత బాగుంటారూ; కొద్దిగా కొసలందు పైకి ముడుచుకొని వేరయిన ఎఱ్ఱని పెదిమెలూ, కొంచెం చిన్నవైన కళ్లూ, నవ్వుకి అలలా నడిచిన తీగలాంటి శరీరంలో కదలికా, అన్నీ అందంగా, ఊపిరాపే చందంగా!

కానీ పు ఇక్కడినించే పరిస్థితులు వేగంగా, సుందరాని కిష్టంలేనంత వేగంగా నడిచినయ్. పోతూపోతూ కుఱ్ఱకుంక ఊరుకోక థండర్ బోల్టువైపు చూస్తూ కళ్లు చికిలించి పళ్ళు ఇకిలింపుగా బయటపడేసి వెక్కిరించాడు. ఉత్తమజాతి శ్వానం ఊరుకోదు అవమానిస్తేనని వాడికి తెలియదు. గొంతికలో కోపం సుళ్ళుతిరిగి మంద్రస్థాయి అరుపుతో తోక నేలతాడించి ముందుకు దూకింది థండర్. సుందరంగాని సమయానికి దాని ఉద్ధృతం ఆపకపోతే కుఱ్ఱవాడికి మరపురాని గుణపాఠం నేర్పేది. సుందరి మొహం ఎఱ్ఱబడింది, "ఏయ్ మిష్టర్, వాళ్ళా కీళ్ళమీద ఎగిరిపడకుండా నీ కుక్కని అదుపులో పెట్టుకో" అని ఇంగ్లీషులో మందలించింది.

సుందరానికి కోపంరాలా, నొచ్చుకున్నాడు "ఎదటివాళ్ళని తప్పుపట్టేముందు ఎందుకు చాలామంది తనకొ ముందు క్షమిస్తించుకోరూ" అని. నవ్వుతూ అన్నాడు, "మీ వెనకాల దాక్కున్న పెద్దమనిషిని కొంచెం తన ముఖకండరాలు అదుపులో పెట్టుకోమని అడగండి. నేగనక పట్టుకోకపోతే మా కుక్క అతని జలుబు చప్పగా కుదిర్చేది."

"ఏంరా, ఏంచేశావు నువ్వు?" అదే దూషణతో ఆవేశంలో అడుగుతోంది అర్చకుణ్ణి.

"అది కాదే, మరేమో నే నసలా కుక్క వేషే చూడలా! ఆ చెట్టుని ఎక్కరించాను." చిన్నపిల్లల వాదం ఏ దేశంలో గాని ఒకే విధంగా నడుస్తుంది.

సుందరం నవ్వాడు. ఆమె సిగ్గుపడింది. కపోలాలికి కొత్తగా రావలసిన అరుణిమ లేదు, కోపమొచ్చినప్పుడున్న ఎఱ్ఱదనం చాలు. 'నేను చాల విచారిస్తున్నా'నని మృదువుగా అంది. ఊటీ చల్లదనాన్ని ఇంకా శీతలింపించుతయ్ అందమైన ఆడపిల్లల లజ్జావచస్సులు.

"*Not at all*" అని మర్యాదగా ఆమె విచారాన్ని తోసేశాడు కథానాయకుడు. అతను ఆలోచిస్తున్నాడు కుజ్జానికోప ముపేగించడ మెలా అని.

"నాకు ఆల్సేషియన్లంటే ఇష్టంలేదు" అన్నదామె.

"నాకు పగ్ డాగ్స్ అంటే ఇష్టం లేక పోలేదు" అన్నాడు సుందరం నవ్వుతూ. "నన్ను ప్రేమిస్తే, నా కుక్కని ప్రేమించు" అన్న విషయ మతనికి బాగా తెలుసు.

ఆమె సంతోషించింది. "నిజంగా! మీకు పగ్ డాగ్స్ అంటే ఇష్టమా? ఇది చాలా మంచికుక్క. మా యిద్దరికీ *Perfect understanding.*" భూమికి జానెడు లేని తన కుక్క సుగుణాలు వర్ణిస్తోంది ఉత్సాహంగా. సుందరం తన్మయత్వంతో విన్నాడు, మధ్యమధ్య నోమాట అందిస్తూ.

తర్వాత కుజ్జాన్ని బెల్లిస్తూ పిలిచాడు, "రావేమ్మా, ఇది ఎంత మంచికుక్క! షేక్‌హాండిచ్చి స్నేహం చేసుకోవూ?" అని.

"ఛీ! వెధవకుక్క. కరుస్తుంది." వెనక్కి తగ్గాడు వెంకి ఘటం!

సుందరం ఇది లాభం లేదనీ అని థండర్ వైపు తిరిగాడు. దానికోపం చల్లారిపోయింది, కౌతుకంతో పరీక్షిస్తోంది ఆ అమ్మాయినీ పరివారాన్నీ. "తప్పు కాదూ, నువ్వు చిన్నపిల్లల్లా భయపెట్టడం? చూడిప్పుడా కుజ్జాడు నీస్నేహం ఒద్దంటున్నాడు. వెళ్లి దణ్ణంపెట్టి క్షమాపణడుగు పో" అని దానిచేత రెండుకాళ్లూ ఎత్తి దణ్ణం పెట్టించాడు. నౌకరు రామిగాడు తోచని సమయాల్లో నేర్పిన విద్యలన్నీ ప్రదర్శింపించాడు దానిచేత. కుజ్జా వెధవకి భయం పూర్తిగా పోయింది, ఆ అమ్మాయికి కొద్దిగా ఇష్టం కలుగుతున్నట్లుంది.

"తెలివైన కుక్కే నే" అన్నది ఆశ్చర్యంగా.

"అందుకు సందేహమా?" అని గర్వపడిన సుందరం పనిలో పనిగా, 'మీ పేరు తెలుసుకోవచ్చునా?' కత్తుకలుపుతున్నాడు.

"నా పేరు మైథిలి" అన్నది.

"నేను సుందరరామశర్మని. వ్యవహారానికి సుందరాన్ని" అన్నాడు చక్కగా.

"మిమ్మల్ని కలుసుకున్నందుకు నాకు చాల సంతోషంగా ఉన్న"దన్నది మైథిలి సగం సిగ్గుగా.

సుందరం ఎవరెస్టుశిఖరానికి ఎగబ్రాకాడు, మబ్బుల నెత్తిమీద నడిచాడు, గాలితో కేళిగా పరిగెట్టాడు. ఇన్నీ చేసి ఇతోధిక ఉత్సాహంతో కబుర్లు చెప్పాడు.

మైథిలి అనుకుంది, ఎప్పుడుగాని ఇవాళ్టిలో సగమాత్రం ఆనందం తను పొందలే. ఎంత కొత్తగా కూర్మిగా, ఎంత తెలివిగా తియ్యగా మాట్లాడుతున్నాడు!

ఆమెలో ఇతః పూర్వం ఎవరియెడల గాని అననుభూతమై అతన్నిగూర్చి తెలుసుకోవాలనే ఆకాంక్ష అవ్యక్తంగా; అతనిలో ఆమెనిగూర్చి వ్యక్తంగా.

"ఈ కుక్క పేరేమిటి?"

"రాబిన్. దాని పేరో?"

"థండర్ బోల్ట్. పరుషంగా ఉంది కదూ?"

కుక్కలికి (కుజ్జాలకికూడా) ఇంగ్లీషులో గాని పేర్లు పెట్టరు సాధారణంగా. అక్కడక్కడ ఒకటి రెండు పేర్లు హిందీలో కూడా కద్దు. అయితే తెలుగులోకి దిగామో, రాముడు రంగడు ఇవి తప్పితే వేరే పేర్లు కనపడవు. కుక్కమీద పంచప్రాణాలుండే యజమానికి పేరుపెట్టేవేళ అజామిళుడి కథ గాని గుర్తొస్తుందేమో?

డాగ్ షో మొదలెట్టింది.

కాకర్ స్పానియల్, బుల్ టెరియర్, హౌవా ఏవో తలాతోకా లేనన్ని రకాలు, జాతిభేదాన్ని బట్టీ రిట్రీవింగ్ కీ విధేయతకీ వేర్వేరే అన్నీ కలిసి దిక్కుమాలినన్ని బహుమతులు. థండర్స్ ఆల్సేషియన్లకి ప్రత్యేకించిన కప్పు తన్నుకుపోయింది. రాబిన్‌కి ఏ బహుమతీ వచ్చే అదృష్టం పట్టలా.

సుందరం తన విచారాన్ని వెలిబుచ్చాడు, "ఇంత చక్కని చిన్నకుక్క" అని రాబిన్‌ని మెచ్చుకున్నాడు. "ఎంత మంచివాడితనూ" అనుకున్నదామె మనస్సులో. అతన్నీ కుక్కనీ అభినందించింది.

"మీరు వేసవి కొచ్చా రనుకుంటానే యిక్కడికి?" అన్నాడు సుందరం.

అవునన్నట్లు తలూపింది. "అసలు మాది మెడ్రాసు. నే నక్కడ ఇంటర్ చదువుతున్నా" నంది.

"అలా చెప్పు. నువ్వు షోడశివి. అందుకనే మధురంగా రేఖామాత్రంగా ఆ శైశవ రాగం నీ మాటల్లో" అనుకున్నాడు సుందరం. అతను భావుకుడు.

అంతా కథలోకి మల్లే, కలలోకిమల్లే— ఇద్దరికీ, అతని కెక్కువగా ఆమెకి కొంచెం తక్కువగా. "సాయంసమయాలు మన మీ కుక్కల్నేసుకుని ఎందుకు షికారు పోగూడదూ" అని సుందరం సజెశ్చన్. ఆమె ఉత్సాహం చూపింది. అతను ఆకాశం అంటాడు.

ఉప్పెనలా గుండెలో విప్లవిస్తున్న ఆనందం, వెన్నెల వెలిగించిన వినువీధిగా మనస్సు. గాలిలో తేలిపోతూన్నట్లు తన కన్న ముందడుగు వేస్తూన్న సుందరాన్ని చూచి ఏమయిందీతనికి అని ప్రశ్నార్థకంగా తెల్లబోయిందిథండర్, ఇంటికి పోతూంటే.

మర్నాడు మామయ్య సంతోషం వెలిబుచ్చడానికి తగినన్ని మాటలు దొరక్కపోయినయ్ ఏ భాషలోనూ. "నే నుండవలసింది అక్కడ" అన్నాడు కొసకి. సుందరానికి మామయ్యరావడంమూలాన ఎవరిక్కాని వచ్చే అదనపు లాభ మేమిటో అర్థంకాలా.

మైథిలి కోసమన్నా తను ఆలిండియా సర్వీసెస్‌కి గట్టిగా చదవాలి. సుందరం పుస్తకాలు ముందేసుకుని తీవ్రంగా చదవడం మొదలెట్టాడు. కాని మామయ్యకంతా వేళాకోళం - ఆయనకి మైథిలి సంగతి తెలియదు— "అరెరే, ఎందుకోయ్ అంత కోపం నీ పుస్తకాలమీద. వాటి కొక్క విశ్రాంతి ఇవ్వ మతే" అన్నాడు. ఇంతలో పెళ్ళాం అటు రాగా ఆయనకి హాస్యరస ప్రకోపం అధికమైంది...... "ఒరేయ్ సుందరం నిన్ను చూసి అప్పుడప్పుడనుకుంటా నా నీకీడైన కూతురు నాకు లేకపోయెనే అని. నువ్వు కూడా మీ అత్తయ్యనెప్పుడూ అడగవేం, చేపా చేపా ఎందుకెండలేదూ? అని."

సుందరం మొదటిసారిగా మామయ్య మాటలు లెక్కపెట్టలా; పుస్తకంనించి తల యెత్తలే దతను. ★